దడ, ఆయాసం, కాళ్ళూ చేతులూ పీకుట, నడుము నొప్పి, గుండెల్లో మంట, చచ్చే నీరసం.

రాజేశ్వరి బాధలన్నిటినీ ఓపిగ్గా వింటూంది శ్రుతి. చెప్పిందే మళ్ళీ చెప్తూందామె. ఒక్కొక్క బాధనీ చిలవలు పలవలు చేసి వర్ణించి చెప్తూంది. మధ్య మధ్యలో కన్నీళ్ళు పెట్టుకుని పమిట చెంగుతో ముక్కు, కళ్ళు తుడుచుకుంటూంది. శ్రుతి సహనం చచ్చిపోతూంది. ఐనా దిగమింగుకుని, చిరునవ్వును ముఖానికి పులుముకుని బ్రహ్మప్రయత్నం మీద ఆమె వాక్ప్రవాహాన్ని ఆపి, పరీక్ష చేయసాగింది.

"అమ్మగారూ! ఇంతకుముందు దిట్టంగా వుండేదాన్నండి. ఆ మాయదారి ఆపరేషన్ చేయించుకున్నాకే ఈ రోగాలన్నీ పట్టుకున్నాయి" శ్రుతి స్టెత్‌తో రాజేశ్వరి ఛెస్ట్‌ని పరీక్ష చేస్తూంది. తనో ప్రక్క దీక్షగా పరీక్ష చేస్తున్నా ఆవిడ మాట్లాడడానికే కంకణం కట్టుకోవడం చూసి చిరాకేసి పరీక్ష చెయ్యడం ఆపింది.

"ఏం ఆపరేషన్ చేయించుకున్నారు?" సాధ్యమైనంత మృదువుగా అడిగింది శ్రుతి.

"పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేశారండి" గొంతుక కోసేసినంత బాధగా చెప్పిందామె.

"ఎన్నాళ్ళయింది?"

"నాలుగేళ్ళయిందండి. అప్పట్నించే నాకీ తిప్పలన్నీ. అప్పట్నుంచీ వైట్ బట్ట కూడా అవుతుందండి" చివరి విషయం గొంతు తగ్గించి చెప్పింది రాజేశ్వరి.

"అది సరే. పిల్లలు పుట్టకుండా చేసిన ఆపరేషన్‌కీ, మీ బాధలకీ ఏమిటి సంబంధం?"

ట్యూబెక్టమీ అయాక తలనొప్పి వచ్చినా, తుమ్మొచ్చినా, దగ్గొచ్చినా, ఎన్నేళ్ళుపోయాకొచ్చినా, దాన్ని ఆపరేషన్‌కి అన్వయించి చేయించుకున్నందుకు పశ్చాత్తాపంతో బాధపడే మహిళల్ని చూస్తే చిర్రెత్తుకొస్తుంది శ్రుతికి. కాని మరుక్షణం వివేకం వెన్ను తడుతుంది. తను చిరాకుపడి, కోపంతో చిందులు తొక్కినందువల్ల ప్రయోజనం లేదు. అసలలా చేయడం తన మూర్ఖత్వమే అవుతుంది. తను మెడిసిన్ చదువుకోకపోయుంటే, అసలేమీ చదువుకోకపోయుంటే ఈమెలానే వుండివుండేది. కనీస పరిజ్ఞానం లేకుండా తర్కించి ఆలోచించే శక్తి లేకుండా ఈమె స్థాయిలోనే వుండి వుండేది. ఇలాంటి కోట్లాది మహిళలకు జ్ఞానబోధ కావించే మహత్తరశక్తి లేదు తనకు. కాని తన దగ్గరకు వచ్చే కొద్ది

# సరైన మందు



డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

## పేషంట్ చెప్పే కథలు

మంది స్త్రీలకు యిలాంటి చిన్న చిన్న విషయాల గురించి తెలియచెప్పాల్సిన సామాజిక బాధ్యత తన మీదుంది.

వివరంగా రాజేశ్వరికి చెప్పసాగింది శ్రుతి.

"అదేంటమ్మగారూ అలా అంటారు! చేయించుకున్నాళ్ళంతా ఏదో ఒక బాధ చెప్తానేవున్నారు" అంది. శ్రుతికోరిఅబద్ధం చెప్తూ తనని మభ్యపెడుతున్నట్లనిపించింది రాజేశ్వరికి. ఆమె భావాన్ని అర్థం చేసుకున్న శ్రుతి ఎలా మొదలుపెట్టాలో, ఆమెకెలా నచ్చచెప్పాలో తోచక ఒక నిమిషం మౌనంగా వుండిపోయింది.

"మీ పేరేమిటన్నారు?"

"రాజేశ్వరండి."

"మీ వయసెంత?"

"పాతికండి."

"పిల్లలెంతమంది?"

"నలుగురండి పెద్దదానికి పన్నెండో ఏడండి. మొన్నే చుట్టరికం చూశామండి. రేపు శ్రావణంలో లగ్గా పెట్టుకుంటామండి. ఇదిగో ఇదేనండి మా పెద్దది. ముందు దీన్ని చూడండమ్మగారూ! పన్నెండో ఏడొచ్చినా ఈడు రాలేదండి. నక్కలా ఎండిపోయింది. పన్నెండో ఏడంటే ఎవరూ నమ్మడంలేదండి. మీరు మంచి మంచి మందులిచ్చి తొందరగా పెద్దమనిషయేలా చూడాలండి. ఇదిట్లా వుంటే చుట్టరిక మెక్కడ తప్పిపోతందోనని మాచెడ్డ బయంగా బయంగా వుందండి" కళ్ళప్పగించి చూస్తూంది శ్రుతి.

"ఏంటమ్మగారూ, అట్లా చూస్తన్నారు"

"అబ్బే ఏం లేదు" తన ముందు నిలబడ్డ పసిదాన్ని పరిశీలనగా చూస్తున్న శ్రుతి జవాబిచ్చింది.

"దీంతరువాత దానికి పదేళ్ళండి. దానికి కూడా చుట్టరికం చూస్తన్నాం. అయినాళ్ళేలెండి. దీంతరవాత కానుపుకి దేముడు నా మొరిన్నాడండి. మగనలుసు పుట్లాదండి. ఆడి తరవాత నాలుగేళ్ళదాకా కానుపు లేదండి. యిక పుట్టరనే అనుకున్నానండి. అంతలోకి ఈ చిన్నాడు కడుపున పడ్డాడండి" చెప్తూనే నాలుగేళ్ళ కొడుకుని ప్రేమగా దగ్గరకు లాక్కొని పమిటచెంగు తొలగించి రొమ్ము నోట్లో పెట్టింది రాజేశ్వరి. ఆ దృశ్యం చూశాక రాజేశ్వరి సమస్తమైన బాధలకూ మూలకారణం కొంతవరకు తెలిసింది శ్రుతికి.

"మీ ఆయనేం చేస్తారమ్మా?" భర్త ప్రసక్తి రాగానే రాజేశ్వరి ముఖం మేఘావృతమైంది.

"ఏం చేస్తాడు? కూచుని మింగుతాడు. ఊరు బలాదూరు తిరుగుతాడు. పిల్లలు, పాడి గేదెలు.... అన్ని పనులకీ నేను చావాల్సిందే. చిన్నమెత్తు పనిముట్టుకోడు. పని సంగతి సరే. ఇంటికొచ్చాక చచ్చావా, బతికావా అనైనా అడగడు. ఛస్! పోనీయండి. ఆయన మాటెవడిగ్గావాలి. నా పిల్లలకోసం నేను బతుకుతున్నానంతే." విరక్తిగా అంది రాజేశ్వరి. ఆమె జబ్బేమిటో యిప్పుడు పూర్తిగా అర్థమయింది శ్రుతికి. పసితనం పోకుండానే కానుపులు. సరైన బలం చేకూరి మనశ్శరీరాలు మామూలు స్థితికి వచ్చే అవకాశం లేకపోవడం, నడుమెత్తలేని చాకిరీ, తన పనికి ప్రేమకు, ఆప్యాయతకు చిన్నమెత్తు గుర్తింపు లేకపోవడం, భర్తనుంచి కొద్దిపాటి అనురాగాన్నీ, ఆత్మీయతనూ పొందలేకపోవడం, ఎదిగిన పిల్లలకు పాలిచ్చే అజ్ఞానం, మరెన్నో భ్రమలు, అపోహలు, ఎన్నెన్నో మూఢవిశ్వాసాలు. రాజేశ్వరిలాంటి స్త్రీలకు కావలసింది కేవలం టానిక్కులూ, మందులూ కాదు.... మందుల చీటీ చేతో పట్టుకుని ఆలోచిస్తూంది శ్రుతి.